క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

బిక్కవోలు: బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీ సాయి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, బాబా వారికి హారతులు నిర్వహించారు. అర్చకుడు మురళి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ



మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెం గ్రామానికి చెందిన మరడ శ్రీనివాస్ ఇటీవల పీహెచ్‌డీ పొందారు. ఆయన తెలంగాణలోని అదిలాబాద్ జిల్లా ఉట్నూరు డిగ్రీ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ ఆయన డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బోటనీలో మొక్కల పెరుగుదల, ఖనిజ పోషణపై ఉపయోగకర సూక్ష్మజీవుల ప్రభావం అనే అంశంపై పరిశోధన చేశారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

పెదపూడి: గ్రామాభివృద్ధికి అందరూరు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దశల వారీగా చేపట్టాల్సిన పనులు, డ్రైనేజీలు, రోడ్లు తదితర చర్చించారు. కార్యక్రమంలో సర్పంచి కె.కృష్ణమూర్తి, సొసైటీ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, మార్ని వెంకట్రావు పాల్గొన్నారు.

దేశాభిమానాన్ని పెంపొందించే ఎన్‌సీసీ



ఎన్‌సీసీ క్యాంపులో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజానగరం: యువతలో దేశంపై అభిమానం, అంకితభావాన్ని పెంపొందించడంతో పాటు ఉత్తమ పౌరులుగా ఎదగాలనే భావనను కలిగించేలా ఎన్‌సీసీ కార్యక్రమాలు ఉంటాయని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. స్థానిక గైట్ కళాశాల ఆవరణలో ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేటెడ్ క్యాంపును గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దేశ వైవిధ్యం, భిన్నత్వంలో ఏకత్వం అనే అంశాలను భావితరాలకు అందించే విధంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కల్నల్ ఆర్ఎం అగర్వాల్, కాకినాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలో తలపడుతున్న విద్యార్థులు

రాజానగరం: దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సీబీఎస్ఈ క్లస్టర్ 7 వాలీబాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను విద్యానికేతన్ కరస్పాండెంట్ విజయ ప్రకాష్ ప్రారంభించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలోని 110 సీబీఎస్ఈ స్కూళ్ల నుంచి 1400 క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, మేనేజర్లు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ నెల 6వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు యశ్వంత్, సీబీఎస్ఈ క్రీడల పరిశీలకులు కిషోర్ కుమార్ (ఎస్‌కేవీటీ కళాశాల), ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజర్ ఎస్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంలో గ్రామ సభ

రాజానగరం: మండలంలోని పుణ్యక్షేత్రం గ్రామంలో గురువారం గ్రామసభ నిరవహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామ సభ ఆవశ్యకతను తెలియజేశారు.

వైద్యశిబిరం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సాయిబాబా ఆలయంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో రాజమహేంద్రవవరానికి చెందిన కంటి, దంత, జనరల్, ఫిజీషియన్ వైద్యులు సేవలందించారు. బూరుగుపూడి, గుమ్ములూరు గ్రామాలకు చెందిన 500 మంది వైద్య సేవలు పొందారు.

బ్రాందీ షాపులకు ఐదు దరఖాస్తులు

మధురపూడి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కోరుకొండ సర్కిల్ పరిధిలో బ్రాందీ షాపుల కోసం గురువారం ఐదు దరఖాస్తులు వచ్చినట్టు సీఐ జె.శ్రీనివాస బాలాజీ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. అనంతరం ఈ నెల 11వ తేదీన డ్రా ప్రక్రియ జరుగుతుందని, 12వ తేదీ నుంచి అమ్మకాలు మొదలవుతాయన్నారు. కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో 12 షాపులు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

- చిన్న పనులపైనా కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం
- కాతేరు– సీతానగరం రోడ్డే నిదర్శనం
- వంద రోజులైనా పట్టించుకోని వైనం
- జక్కంపూడి రాజా హయాంలోనే దాదాపు పూర్తి



రాజమహేంద్రవరం - సీతానగరం రోడ్డులో రఘుదేవపురం వద్ద ఏర్పడిన గొయ్యి

సీతానగరం: ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి వంద రోజులు పూర్తయ్యాయి. సూపర్ సిక్స్ హామీలపై విస్తృతం ప్రచారం చేసిన ఆ పార్టీ నాయకులు అధికారంలోకి వచ్చాక వాటిని మర్చిపోయారు. అలాగే నియోజకవర్గాలలో సమస్యలను పరిష్కరిస్తామంటూ ప్రజలకు ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యేలు కూడా ఇప్పుడు సమస్యలపై మాట్లాడడం లేదు. కొంచెం శ్రద్ధ చూపిస్తే పరిష్కారమయ్యే వాటిని కూడా పట్టించుకోవడం లేదు. దీనికి కాతేరు – సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డు సాక్ష్యం నిలుస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో ప్రారంభమైన ఈ రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. కల్వర్టుల వద్ద ప్రధాన రోడ్డును కలిపే పనులు మాత్రమే మిగిలాయి. వాటిని కూడా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

దాదాపు పూర్తి

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హయాంలోనే కాతేరు – సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. కల్వర్టుల వద్ద రోడ్డు పనులు మాత్రమే మిగిలాయి. ఎన్నికల కోడ్‌తో అవి ఆగిపోయాయి. కాటవరం వద్ద కల్వర్టు, మునికూడలి, మునికూడలి ర్యాంపు, ముగ్గళ్ల వద్ద ఈ రోడ్లను నిర్మించాల్సి ఉంది. కాతేరు – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డును రూ.70 కోట్లతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించారు. కాతేరు నుంచి సీతానగరం వరకూ 18.2 కిలోమీటర్ల పొడవున నాలుగు లైన్ల రోడ్డుకు అంచనా వ్యయం రూ.70 కోట్లు కాగా, మరో రూ.35 కోట్లు అవసరం అవుతుందని నివేదిక సంబంధిత శాఖకు అందించారు. బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకు గ్రామాల వద్ద సిమెంట్ డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు నిర్మించారు. ఈ సిమెంట్ రోడ్ల పొడవు 10.5 కిలోమీటర్లు ఉంటుంది. కాతేరు నుంచి సీతానగరం వరకూ పలు గ్రామాల వద్ద 13 కల్వర్టులు నిర్మించారు. కేవలం కాటవరం వద్ద మాత్రమే కట్టాల్సి ఉంది. అయితే కల్వర్టుల వద్ద రోడ్డు అనుసంధానం పనులు చేయాలి. బొబ్బిల్లంక వద్ద బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉండగా, వాటికి అంచనాలు రూపొందించి ఆయా శాఖల ఉన్నతాధికారులకు పంపించారు.

అధ్వానంగా రోడ్డు

ఎన్నికల కోడ్‌తో నిలిచిన అరకొర పనులను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. అలాగే రఘుదేవపురం శివారు నుంచి రాపాక డ్యామ్ వద్ద వరకు రోడ్డు గోతులు పడి అధ్వానంగా మారింది. కాటవరం వినాయకుని గుడి వద్ద కల్వర్టు పనులను పట్టించుకోలేదు. మునికూడలి సెంటర్, ర్యాంపు, ముగ్గళ్ల వద్ద రోడ్లను నిర్మించడానికి శ్రద్ధ చూపడం లేదు.



మునికూడలి సెంటర్ వద్ద ఆగిన రోడ్డు పనులు



ముగ్గళ్లలో కల్వర్టు వద్ద నిలిచిన నిర్మాణం

మాజీ ఎమ్మెల్యే రాజా కృషి



కాతేరు – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితోనే జరిగింది. దాదాపు 95 శాతం పనులను ఆయన పూర్తి చేశారు. మిగిలిన ఐదు శాతం పనులు చేయడంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఎన్నికల కోడ్ నిలిచిన పనులు ముందుకు సాగడం లేదు. వెంటనే రోడ్డులను పనులు చేపట్టాలి.

– అంబటి రాజు, మునికూడలి

నరక యాతన



అరకొర పనులపై కూడా కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. రఘుదేవపురం శివారు నుంచి శ్రీరామనగరం కొబ్బరి తోట వరకు రోడ్డు గోతులతో అధ్వానంగా మారింది. ఆ దారిలో వెళితే కార్లు మరమ్మతులకు గురవుతున్నాయి. సీతానగరం నుంచి రఘుదేవపురం శివారు వరకు నరకం చూస్తున్నాము. కొన్ని ప్రాంతాల్లో కల్వర్టుల వద్ద రోడ్డు పనులు చేపట్టాలి.

– ఈత గణేష్, సీతానగరం

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించాలి



సీతానగరంలో మాట్లాడుతున్న వీరబాబు

సీతానగరం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీతానగరంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండున్నరేళ్లుగా స్టీల్ ప్లాంట్ కార్మికులు దీక్ష చేస్తున్నారన్నారు. నేటికి ఆ కార్మికుల సమస్యలపై బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. పరిశ్రమ నష్టాల్లో ఉందంటూ కావాలనే కొందరు లెక్కలు చూపుతున్నారన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

మధురపూడి: కోరుకొండ మండలంలోని ఆరుగురు పంచాయతీల కార్యదర్శులు గురువారం బదిలీ అయ్యారు. ఈ మేరకు వీరందరూ రిలీవ్ ఆర్డర్లు తీసుకున్నారు. గాడాల సెక్రటరీ బి.సత్యానందకుమార్ అనపర్తి నియోజకవర్గంలోని మహేంద్రవాడకు, శ్రీరంగపట్నం సెక్రటరీ జానా శ్రీనివాస్ రాజానగరం మండలం భూపాలపట్నానికి, బొల్లెద్దుపాలెం కార్యదర్శి జి.శ్రీలక్ష్మి సీతానగరం మండలం బొబ్బిల్లంకకు, బుచ్చెంపేట కార్యదర్శి కె.శాంతి ప్రసన్న కాటవరానికి, నర్సాపురం కార్యదర్శి డీవీ నాగరత్నం గాడాలకు, గాదరాడ కార్యదర్శి ఏవీవీ ఆంజనేయులు అల్లూరి సీతారామరాజు జిల్లా పూడిపల్లికి బదిలీ అయ్యారు.

ఏకగ్రీవంగా ఆలయ కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న సంఘ పెద్దలు

రంగంపేట: గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద ఉన్న గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. ఆలయ ధర్మకర్త సిద్ధాంతపు సత్తిబాబు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గరగడాల నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా ర్యాలి చిన రామాచార్యులు, సెక్రటరీగా కొత్తుర్తి సత్తిబాబు, జాయింట్ సెక్రటరీగా అనుపోజు భాస్కరరావు, ట్రెజరర్‌గా కొండేపూడి లోవరాజు నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి సంఘం మండల అధ్యక్షుడు దార్ల అమ్మిరాజు, సంఘ పెద్ద ముళ్లపూడి బ్రహ్మాజీ పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామన్నారు.

రాంబాబు యువసేన సేవలు అభినందనీయం



రక్తదాతను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. అనపర్తి ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ సీపీ అనపర్తి మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన 14వ రక్తదాన శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాంబాబు యువసేన చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఏటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రత్యేకంగా అనపర్తి బ్లడ్ డోనర్స్ యాప్‌ను రూపొందించి, దానినుంచి నిరంతరం రక్తదానం చేయడం చాలా మంచి కార్యక్రమమన్నారు. సత్తి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకూ 14 రక్తదాన శిబిరాలు నిర్వహించామని, మూడు వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సమకూర్చామన్నారు. అనపర్తి బ్లడ్‌డోనర్స్ యాప్ ద్వారా నమోదైన 2 వేల మంది దాతలు అవసరమైన మేరకు నిరంతరం రక్తదానం చేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన సంజీవని వలంటీర్ బ్లడ్ బ్యాంక్ బృందం రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అనపర్తి టౌన్ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు సత్తి వెంకటరమారెడ్డి, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి సూరారెడ్డి, అనపర్తి, రంగాపురం సర్పంచులు వారా కుమారి, గండికోట వీరభద్రరావు, బిక్కవోలు మండల పార్టీ కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్ పాల్గొన్నారు.

'సత్యసాయి' తాగునీటి విడుదల బంద్

- నిరవధిక సమ్మెలోకి కార్మికులు
- 80 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా



రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం సమ్మె చేస్తున్న సత్యసాయి సిబ్బంది

సీతానగరం: పురుషోత్తపట్నం శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ సిబ్బంది నిరవధిక సమ్మెతో తాగునీటి విడుదల నిలిచిపోయింది. గురువారం జీరో అవర్ నుంచి సిబ్బంది శుద్ధి అయిన తాగునీటి విడుదలను నిలిపివేశారు. రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వద్ద సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్టమూరి వీరబాబు ఆధ్వర్యంలో 53 మంది సిబ్బంది సమ్మె చేపట్టారు. దీనితో సీతానగరం, కోరుకొండ, గోకవరం, దేవీపట్నం, రాజానగరం మండలాల్లోని 80 గ్రామాలకు నీటి విడుదల ఆగిపోయింది. సుమారు నాలుగు లక్షల మంది ప్రజలు రక్షిత తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షుడు వీరబాబు మాట్లాడుతూ జీతాలు అందక అధిక వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన 16 నెలల జీతాలు తక్షణమే అందించాలన్నారు. ప్రభుత్వ బిల్లులతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్ నేరుగా జీతాలు చెల్లించాని, తమ బ్యాంక్ ఖాతాలో జమ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐలు కట్టాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేవరకూ నిరవధిక సమ్మె కొనసాగిస్తామన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

పెదపూడి: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం అనపర్తిలో ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువమంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే చనిపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెదపూడి: కరకుదురులోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్నారని కాకినాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ భాస్కర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలో ఉదయం 7 నుంచి 10 గంటల విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొలువుదీరిన కల్పవల్లి

- ఊరూరా దసరా ఉత్సవాలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- అంతటా ఆధ్యాత్మిక సందడి



అనపర్తిలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు



దోసకాయలపల్లి దేవితల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు తదితరులు



పందలపాక వెలంపేట రామాలయం వద్ద కొలువైన శ్రీదేవి అమ్మవారు



చంద్రేడులో సర్వఅలంకరణలో దుర్గాదేవి



బాలా త్రిపుర సుందరీదేవిగా వడిశలేరులో అమ్మవారు

పెదపూడి: అనపర్తి, రాజానగరం నియోజకవర్గాలలో దసరా శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ ఆలయాలు, వివిధ చోట్ల ఏర్పాటు చేసిన మండపాలలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. అనపర్తిలో గ్రామ దేవత వీరుళ్లమ్మ ఓంశక్తి సత్సంగం ఆధ్వర్యంలో జరిగే శారద శరన్నవరాత్ర ఉత్సవాలు గురువారం మొదలయ్యాయి. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు కలశ స్థాపన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారి ఊరేగింపు

పెదపూడి మండలంలోని గ్రామాల్లో గురువారం శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పండితుల వేదమంత్రోచ్చారణలతో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, సంపర, కాండ్రేగుల, రామేశ్వరం, కరకుదురు, ఏపీత్రయం గ్రామాలలో ఉత్సవాలు వైభవంగా మొదలయ్యాయి.

రాజానగరం: రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో కొలువైన సరస్వతీ మాత విగ్రహం వద్ద నిత్య కుంకుమ పూజలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. చక్రద్వారబంధంలోని దేవీ చౌక్ 32వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని జగన్మాతను స్వర్ణ కవచంతో అలంకరించారు. దివాన్ చెరువు, పాలచర్ల, లాలాచెరువు హెచ్‌బీ కాలనీ, శ్రీకృష్ణపట్నం, తోకాడ, రాజానగరం, తుంగపాడు, పుణ్యక్షేత్రం, నామవరం, సంపత్‌నగరం, కొండగుంటూరు గ్రామాల్లోని కనక దుర్గమ్మ ఆలయాలలో పూజలు మొదలయ్యాయి.

బిక్కవోలు: బిక్కవోలులోని ప్రాచీన శ్రీగోలింగేశ్వ స్వామి ఆలయంలో కొలువైన పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. బలభద్రపురం షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద దేవీనవరాత్ర సహిత శతచండీయాగం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. పందలపాక వెలమపేట రామాలయం వద్ద శ్రీదేవి, సంతోషిమాత, రాజరాజేశ్వరి, కొమరిపాలెం కనకదుర్గమ్మ ఆలయాల్లో కలశస్థాపనలు జరిగాయి. బలభద్రపురం, ఊలపల్లి, కొంకుదురు, తొస్సిపూడి, ఆరికరేవుల, మెళ్లూరు, ఇల్లపల్లి, రంగాపురం, కాపవరం గ్రామాలలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి దేవితల్లి సెంటర్‌లో దసరా నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 59 సంవత్సరాలుగా వీటిని నిర్వహిస్తున్నారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చున్నారు.

రంగంపేట: గ్రామంలోని దేవీ సెంటర్ ఆలయంలో ఉదయం అభిషేకాల అనంతరం కలశస్థాపన, సహస్రనామ కుంకుమార్చన చేశారు. అమ్మవారిని స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించారు. చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో తొలిరోజు అమ్మవారిని సర్వ అలంకార దుర్గాదేవిగా అలంకరించారు. దొంతమూరు మెయిన్ రోడ్డులో కొలువైన విజయదుర్గాదేవి, ఈలకొలనులోని ముత్యాలమ్మ ఆలయంలో ఉత్సవాలు మొదలయ్యాయి. వడిశలేరు విజయదుర్గా అమ్మవారిని మొదటి రోజు బాలత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం, వడిశలేరు గ్రామాలలో విజయదశమి వేడుకలు ప్రారంభమయ్యాయి.

సీతానగరం: సీతానగరం వెలమపేట రామాలయంలో దేవీ విగ్రహం ఏర్పాటు చేశారు. రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగరం, సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీ వద్ద గల కనకదుర్గమ్మ ఆలయాల్లో ఉత్సవాలు మొదలయ్యాయి. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చినకొండేపూడి, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, కూనగరం, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, మునికూడలిలో సందడి మొదలైంది.

అమ్మవారి ఆలయంలో త్రిశూలం ప్రతిష్ఠ



త్రిశూలానికి పూజలు చేస్తున్న భక్తులు

రంగంపేట: చంద్రేడులోని శ్రీదేవి కనకదుర్గమ్మ ఆలయంలో త్రిశూలం ప్రతిష్ఠించినట్టు అర్చకుడు మైలవరపు కృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన దేవళ్ల వెంకట్రావు దంపతుల కుమార్తె, అల్లుడు పిచ్చుకల వీరభద్రరావు, అశ్విని దంపతులు అమ్మవారికి ఈ ఇత్తడి త్రిశూలం సమర్పించారన్నారు. దేవీనవరాత్ర ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో త్రిశూలాన్ని ప్రతిష్ఠించామన్నారు.

డ్రైనేజీల సిల్ట్‌తో సమస్యలు

రంగంపేట: డ్రైనేజీలు, కాలువల నుంచి తీసిన సిల్ట్‌ను రోడ్ల పక్కనే వదిలేయకుండా ఊరి బయటకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల పరిధిలోని మర్రిపూడిలో సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు కొద్ది రోజుల నుంచి పారిశుధ్య పనులు చేపట్టారు. దీనిలో భాగంగా డ్రైనేజీలు, కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగిస్తున్నారు. దాన్ని రోడ్డు పక్కనే వదిలేయడంతో గ్రామంలో సమస్యలు తీవ్రమవుతున్నాయి.

డీజీ సౌండ్‌తో ప్రాణాలకు ముప్పు



అనపర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శివ గణేష్, సూపరింటెండెంట్ శ్రీరామగుర్రెడ్డి

పెదపూడి: ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన డీజీ సౌండ్ పొల్యూషన్ నివారించడానికి అందరు సహకరించాలని అనపర్తి సీఐ శివగణేష్ తెలిపారు. అనపర్తి ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ శ్రీరామ గుర్రెడ్డితో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివగణేష్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఊరేగింపుల్లో వినియోగించే డీజే సౌండ్‌తో విపరీతమైన సౌండ్ పొల్యూషన్ ఏర్పడుతోందన్నారు. దీనివల్ల ప్రజలకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. పండగ అనేది ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించాలన్నారు. పండగల్లో సంప్రదాయ వాయిద్యాలు, కేరళ, తీన్‌మార్ డప్పులు, కోలాటం ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీజీ సౌండ్ కారణంగా కొన్నిచోట్ల గుండెపోటుకు గురై చనిపోతున్నారు. ఆ కేసులు తమ వద్దకు రావడంలేదని, వారు బయట సెటిల్ చేసుకుంటున్నారన్నారు. శ్రీరామ గుర్రెడ్డి మాట్లాడుతూ సౌండ్ పొల్యూషన్‌తో ప్రజలకు ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. సాధారణంగా మనిషికి 15 డిసిబుల్స్ వరకు వినికిడి శక్తి ఉంటుందన్నారు. డీజే సౌండ్ 100 నుంచి 150 డిసిబుల్స్ ఉంటుందన్నారు. ఇలాంటి డీజే సౌండ్ ఊరేగింపులు ఆస్పత్రి పరిసరాల్లో వెళ్లే సమయంలో పేషంట్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చెవి విపరీతమైన ఒత్తిడికి గురై శాశ్వతంగా వినికిడి శక్తిని కోల్పోతుందన్నారు. గుండె ఎక్కువ సార్లు కొట్టుకుని ప్రజలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు.

చిన్నారులకు తులాభారం



సాయిబాబా సన్నిధిలో బాలుడికి తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం దసరా పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొందరు భక్తులు తమ చిన్నారులకు సాయిబాబా సన్నిధిలో పటిక బెల్లం, చిల్లర నాణేలతో తులాభారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. 11 గురువారాలుగా చేస్తున్న గురుచరిత్ర పారాయణ ఈ గురువారం ముగియాల్సి ఉంది. మధ్యలో ఒక వారం సాయిసచ్చరితను పారాయణ చేసి ఉండటంతో వచ్చే గురువారంతో పూర్తవుతుంది.